

అప్పులు బాధ తాళలేక రైతు ఆత్మహత్య

లోకానందం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: వ్యవసాయం చేసికొని భార్య బిడ్డలను పోషించుకోవాలని ఆశతో పొలాన్ని నమ్ముకొని అప్పులు చేసి సాగు చేసిన రైతుకు సరైన లాభాలు రాకపోవడంతో అప్పులు అధికమై చివరకు బాధకు తాళలేక రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మండలం లోని వెస్ట్ వరత్తూరుకు చెందిన రైతు ఎస్ లోకానందం (40) శనివారం పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రైతుకి భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నారు. వున్న రెండు ఎకరాల్లో వరి పంటను వేసేందుకు గతంలో 50వేల రూపాయలు పైన అప్పు తెచ్చాడు. అది ప్రస్తుతం రెండింతలైంది. పంట వేసిన తర్వాత ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పు చెల్లించలేక తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఇంట్లో చెప్పకుండా పొలం వద్దకదు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమార్తెలు ప్రస్తుతం చదువుతున్నారు. పొలం మాత్రమే జీవన ఆధారం అని, తమను పోషించే పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య, పిల్లలు అనాథలు కావడంతో బోరున విలపిస్తున్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

బెల్టు జోరు..పల్లెల్లో బేజారు..

- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు
- చంద్రగిరిలో 98 బెల్టు షాపులు?
- బెల్టు దుకాణాలకు మద్యం వ్యాపారుల వేలం
- స్పందించని ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: చంద్రగిరిలో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు, మండల కేంద్రాలు అన్న తేడాలేకుండా కిరాణా దుకాణం నుంచి నివాస గృహాలు, పాన్ షాప్‌లు, కూల్ డ్రింక్ షాపులు, టీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం ఏరులై పారుతోంది. చంద్రగిరి నియోజకవర్గంలో దాదాపు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, హోటల్స్, ఇసుక రవాణా కార్మికులకు తెల్లవారు జామునే మద్యం అందిస్తున్న బెల్టు దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. సంబంధిత ఎక్సైజ్ అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

చంద్రగిరిలో 98 బెల్టు షాపులు?

రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చిన నెల రోజులకే ఒక్క చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో 98 బెల్టుషాపులు రావడం, అందులో అత్యధికంగా చిన్నగొట్టిగల్లు మండలంలో 23, చంద్రగిరిలో 21, రామచంద్రాపురం 17, తిరుపతి రూరల్ మండలాల్లో 17, యర్రావారిపాళెం 15, పాకాల మండలంలో 5 బెల్టు షాపులు ఇప్పటి వరకు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చంద్రగిరి నియోజకవర్గ పరిదిలోని గ్రామాల్లో వీధికి ఒక బెల్టు షాపు ఏర్పాటు చేయడంతో మద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీకు బదులుగా మద్యాన్ని తాగి ఎక్కడ పడితే అక్కడ మహిళలు, ఆడపడుచుల పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ఎర్రావారిపాళెం, యల్లమంద, నెరబైలు, భాకరాపేట, దామలచెరువు, ఎ.రంగంపేట, పనపాకం, అనుపల్లి ప్రాంతాల్లో ప్రత్యేకంగా ప్రతి రోజు ఉదయం పూట వాహనాలలో తీసుకువచ్చి, ఆ ప్రాంతాలలోని బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసి వెళుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయం ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్, స్పెషల్ బ్రాంచి, ఇంటలిజెన్స్ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బెల్టు షాపులకు వేలం పాట

ఒక్కప్పుడు పట్టణ ప్రాంతాలకు పరిమితమైన బెల్టు షాపుల దందా ప్రస్తుతం చంద్రగిరి గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతోంది. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో మద్యం దుకాణాల లైసెన్స్ పొందిన మద్యం వ్యాపారులు ఒక్కొక్క బెల్ట్ దుకాణానికి ఇంతా అని వేలం నిర్వహించి ఎవ్వరైతే ఎక్కువ ఇస్తారో వారికి బెల్టు దుకాణం కట్టబెడుతున్నట్లు సమాచారం. మద్యం వ్యాపారులు స్థానిక ఎమ్మెల్యేకి 30 శాతం వాటాలు ఇస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో, ఆ మొత్తాన్ని రాబట్టుకోవడానికి ఇలా వేలం పాటలు పెట్టి మరీ బెల్టు షాపులు ఏర్పాటు చేయిస్తున్నట్లు సమాచారం. వాటాలు ఇవ్వాలంటే ఇలా చేయక తప్పదు కదా అనే సమాధానం బెల్టు షాపు నిర్వాహకుల నుండి వస్తున్న పరిస్థితి. బెల్టు షాపులపై ఉక్కు పాదం మోపుతామని రాష్ట్ర ప్రభుత్వం ఓవైపు ప్రకటిస్తుంటే, చంద్రగిరి నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితులు నెలకొన్నాయి. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు సంబంధించి ఇప్పటికే 98 బెల్ట్ షాపులు నడిపిస్తున్నారంటే ఇందులో అధికారులు అధికారుల సహకారం ఉన్నట్లుగానే భావించాలి. విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా మద్యం ప్రియులు మద్యం సేవించి ఆ మత్తులో అగాయిత్యాలకు పాల్పడుతారేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉదయాన్నే పనుల నిమిత్తం గ్రామాల నుండి వచ్చే మహిళలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థినులు మత్తులో జోగుతున్న మందు బాబులను చూసి హడలిపోతున్నారు. రేటు ఎక్కువైనా సమయానికి మద్యం దొరుకుతుంది కదా అని మందుబాబులు సమయాపాలన లేకుండా మద్యం పుచ్చుకొని మత్తులో జోగుతున్నారు.

నిమ్మకు నిరేత్తిన అధికారులు

చంద్రగిరిలో కొనసాగుతున్న ఈ బెల్టు షాపుల దందా సంగతి తెలిసిన సంబంధిత అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వారం, నెల ముడుపులతో సాధారణ తనికెల విషయాలను ముందుగానే ఆయా బెల్టు షాపుల నిర్వాహకులకు చేరుస్తున్నారు అని సమాచారం.

చంద్రగిరిలో లిక్కర్ తో పాటు గంజాయి

చంద్రగిరిలో లిక్కర్ తో పాటు గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోందనటానికి ఆదివారం ఎ కొంగరవారిపల్లి వద్ద పోలీసులు పట్టుకున్న 22 కేజీల గంజాయి ఉదాహరణ.. జాతీయ రహదారికి ఆనుకుని వున్న ఒక పల్లెలో సోదాలు చేస్తే 22 కేజీల గంజాయి దొరికితే.. మారు మూల పల్లెల్లో కేటుగాళ్లు ఎంతలా అమ్మకాలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. రోజుకు ఎంత అమ్మితే అంత కమీషన్లు మద్యం వ్యాపారులు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఒక్కరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారని తెలుస్తోంది. 24 గంటలు బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు సాగుతుండటంతో ప్రశాంతమైన పల్లెల్లో గొడవలు, అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలు, దాడులు జరిగే పరిస్థితులు ని స్పష్టంగా కనిపిస్తున్నాయి. మద్యం వ్యాపారులు ఒక్కొక్క నెలకు ఒక బెల్టు షాపు నుంచి లక్ష రూపాయలకు తక్కువ లేకుండా ఇవ్వాలని నిబంధన పెట్టగా మరికొంత మంది ఎంత మందు అమ్మితే అంత కమీషన్లు ఇస్తామని బెల్టు షాపు నిర్వాహకులను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. స్పెషల్ బ్రాంచి, ఎక్సైజ్, పోలీసు, తహశీల్దారు, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్, ఎస్పీ ఇంత మంది అధికారులు బెల్టు షాపులను అరికట్టాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో 98 బెల్టు షాపులు ఎలా ఏర్పడ్డాయో అంతు పట్టడం లేదు. ఇంకా కొన్ని షాపులు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

నూతన మద్యం పాలసీలో..

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో మద్యం దుకాణం పొందిన లైసెన్స్ దారు పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకునే అవకాశం లేదు. అయితే లైసెన్సు పొందిన వారు ఎటువంటి అనుమతులు లేకపోయినా మద్యం దుకాణం పక్కనే చిన్నపాటి షెడ్లు వేయించుకొని మద్యం సేవించే వారికి సఫర్యలు చేస్తున్న అధికారులు తనిఖీలు చేయడం లేదని తెలుస్తోంది. గ్రామాలు, పట్టణాలలో శాంతియుతమైన వాతావరణం నెలకొల్పడానికి సమయాపాలన లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్న వారిపై, గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పడ్డ బెల్టు షాపుల నిర్వాహకులపై జిల్లా ఎక్సైజ్ అధికారి, ఎస్పీ, కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేసి చూడాలి.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు ఓ యువకుడిపై ఏర్పేడు పోలీసులు పోక్సో చట్టం కింద ఆదివారం కేసు నమోదు చేశారు. రేణిగుంట మండలం ఎలమండ్యం గిరిజన కాలనీ చెందిన వెంకటేష్(22)కు ఏర్పేడు మండలంలోని రాజులకండ్రిగ గిరిజన కాలనీలో బంధువులు ఉన్నారు. దీంతో వెంకటేష్ తరచూ బంధువుల ఇంటికి వెళ్లి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో తమ బంధువుల అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించడం, వాట్సాప్‌లో అసభ్యకర మెసేజ్‌లు పెట్టడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారించి ఆదివారం పోక్సో కేసు నమోదు చేశారు. యువకుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

పోలీసుల అదుపులో దొంగనోట్ల ముఠా

దొంగ నోట్లు ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, తిరుపతికి చెందిన దొంగ నోట్లు తయారీ ముఠాకు చెందిన నలుగురిని పుత్తూరు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. డీఎస్పీ రవికుమార్ కథనం మేరకు.. తిరుపతి చెర్లోపల్లిలోని తులిప్ రెసిడెన్సీ వద్ద వున్న ఆర్ రమేష్ తన ఇంటిలోని భార్య ఆర్ సంధ్య (40), కూతురు నిషా (25) స్నేహితుడు, మునికృష్ణారావు (32) లతో కలిసి దొంగ నోట్లు తయారు చేస్తున్నారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా దొంగ నోట్లు ఎలా తయారు చేసే విధానాన్ని నేర్చుకొని అందుకు తగిన పరికరాలను సమకూర్చుకున్నారు. మూడు నెలలు పాటు దొంగ నోట్లు తయారు ప్రాక్టీసు చేశారు. తర్వాత గత మూడు నెలల్లో రూ.500 నోట్లను సుమారు 10 లక్షల మేర తయారు చేశారు. వీటిని తిరుపతి శ్రీకాళహస్తి, నెల్లూరు, వెంకటగిరి, చిత్తూరులో చలామణి చేశారు. చివరగా పుత్తూరులో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 192 వంద రూపాయలు నోట్లు కలిగిన కట్టింగ్ చేయని 48 షీట్లు, 156 ఐదు వందల రూపాయలు నోట్లు కలిగిన కట్టింగ్ చేయని 39 షీట్లు కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నోట్లు తయారీకి అవసరమైన 29 రకాల పరికరాలతో పాటు వోక్స్ వ్యాగన్ కారును స్వాధీనం చేసుకున్నారు. పుత్తూరులోని నిర్మల ప్రొవిజనల్ స్టోర్ యజమాని కె కుప్పయ్య శెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన నలుగురిని పుత్తూరు కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించారు. ఈ సమావేశంలో సిఐ కెవి సురేంద్ర నాయుడు, ఎస్ఐ ఓబయ్య, క్రైమ్ డిపార్టుమెంటు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా నాట్యమండలి కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్‌లో ప్రజా నాట్యమండలి ప్రాంతీయ కార్యాలయానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ పాలక ప్రభుత్వాల లోటు పాట్లను పాటల రూపంలో ఎండ గట్టడంలో ప్రజా నాట్యమండలి ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు. జిల్లాల విభజన అనంతరం శ్రీకాళహస్తి డివిజన్ అన్నింటికీ కేంద్ర బిందువుగా మారిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజా నాట్యమండలి కార్యాలయాన్ని శ్రీకాళహస్తి కేంద్రంగా ఏర్పాటు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని తెలిపారు. ఈ కార్యాలయంలోనే జానపదవృత్తి కళాకారుల సంఘ కార్యకలాపాలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి గెడి వేణు, ప్రధాన కార్యదర్శి కాంజేరి సెల్వరాజు, అధ్యక్షుడు హరికృష్ణ, కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్, సీఐటియూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, కొప్పల గురునాథం, పసలరాజ పాల్గొన్నారు.

ప్రజా నాట్య మండలి కార్యాలయ శంకుస్థాపనకు విచ్చేసిన సిఐటియు, కెవిపిఎస్ నాయకులు

పవన్ కళ్యాణ్ దృష్టికి గల్ఫ్ తెలుగోళ్ల కష్టాలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: గల్ఫ్ తెలుగోళ్ల కష్టాలు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. దుబాయ్‌లో జనసేన ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూఏఈలోని జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఈ వన సమారాధనకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్‌లు పాల్గొన్నారు. జనసేన సిద్ధాంతాలు నచ్చి 20 మంది మహిళలు జనసేనలో చేరారు. వీరికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులను గల్ఫ్ జనసేన ప్రతినిధులు సన్మానించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంలో పవన్ కళ్యాణ్ పోషించిన పాత్ర మరువ లేనిదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గల్ఫ్‌లో జనసేన మన సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తుండటం గొప్ప విషయమన్నారు. గల్ఫ్ లో తెలుగు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో జనసేన నాయకుల కృషిని ఆయన అభినందించారు. గల్ఫ్ లో తెలుగువాళ్ళ ఇబ్బందులను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి వారిని ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు ప్రయత్నిస్తామని ఆయన చెప్పారు. గల్ఫ్ ఎన్ఆర్ఐలకు అన్ని రకాలా అండగా వుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, తెలంగాణ జనసేన ప్రచార కార్యదర్శి ఆర్కే నాయుడు, గల్ఫ్ జనసేన ఇన్‌ఛార్జ్ కేసరి త్రిమూర్తులు, కాంచన, శ్రీకాంత్ , మొగేళ్ల చంద్ర శేఖర్, బిరడా సూర్య నారాయణ, ఆరణి మదన్, ఆరణి జగన్ పాల్గొన్నారు.

గల్ఫ్‌లో ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న తెలుగు ప్రజలు

భాషోపాధ్యాయ రాష్ట్ర కార్యదర్శిగా ఆర్ పట్టాభి రామయ్య

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నగరంలోని 'సంహిత' డిగ్రీ కళాశాలలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఇద్దరికీ రాష్ట్ర కమిటీ లో స్థానం లభించింది. ఎస్ఎల్‌టిఏ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పి కాటయ్య (పులిచెర్ల), రాష్ట్ర కార్యదర్శిగా ఆర్ పట్టాభి రామయ్య(బిఎన్‌కండ్రిగ) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఎన్నికైన సందర్భంగా వారు మాట్లాడుతూ భాషా పండితుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో రాష్ట్ర పదవులు కట్టబెట్టిన జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఎస్ఎల్‌టిఏ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్ కుమార్ ఆదివారం వారికి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

బాలుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

తొట్టంబేడు మండలంలోని దిగువ సాంబయ్య పాళెం పాఠశాలలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడ ఏ-కన్వెన్షనల్ సెంటర్ లో సోమవారం నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవంను పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి చేతుల మీదుగా ఆ పరస్కారాన్ని అందుకోబోతున్నారు. వినూత్న బోధన, కళలద్వారా ఉత్తమ శిక్షణ, సాహితీ, సామాజిక సేవలను గుర్తించి ఈ పురస్కారం తనకు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని బాలు అన్నారు. ఈ పురస్కారం రావడం పట్ల ఉపాధ్యాయ మిత్రులు, అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే యుటిఎఫ్ లక్ష్యం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: ఉపాధ్యాయుల సంక్షేమమే యుటిఎఫ్ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సూళ్లూరుపేటలోని సత్యసాయి కళ్యాణ మండపంలో సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం మండలాల యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా కార్యదర్శి కావూరు ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యుటిఎఫ్ నిరంతరం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాటమే లక్ష్యం అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు రిటైర్ అయిన తర్వాత సౌకర్యవంతమైన జీవితాన్ని గడపడానికి వీలుగా ఇప్పుడున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని, కొనసాగించాలని, ఉపాధ్యాయులకు అమలవుతున్న సౌకర్యాలను కొనసాగించడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదని, ప్రభుత్వ విధానాల ఫలితంగా చిన్నాభిన్న మవుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని యుటిఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాబు రెడ్డి కోరారు. 117 జీవోను రద్దు చేయడంతో పాటు, మాతృభాషలోనే బోధన జరగాలని, హైస్కూలు స్థాయిలో రెండు మీడియంలు ఎంచుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. యుటిఎఫ్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తూనే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు అన్నారు. స్వర్ణోత్సవ సంబరాల పేరుతో క్రీడా పోటీలు,సైన్స్ ప్రయోగాల పోటీలు,వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తూ, ఉపాధ్యాయులను చైతన్యం చేయడంతో పాటు, సామాజిక స్పృహ కలిగిన వారిగా తీర్చిదిద్దరంలో ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. జనవరి 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు శేఖర్, మహిళా కమిటీ కన్వీనర్ సునీలతో పాటు,జిల్లా కార్యదర్శులు మోహన్ బాబు, అవనిగడ్డ పద్మజ, వెంకట కృష్ణ, కావూరు ప్రభాకర్, రామ్మూర్తి, మూడు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సూళ్లూరుపేట మండలం నుండి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నగరం రామమూర్తి, ప్రధాన కార్యదర్శి చైనీ జనార్ధన్, తడ మండలం నుండి అధ్యక్షులు కే.రాంబాబు, ప్రధాన కార్యదర్శి నగరం రవికుమార్, దొరవారిసత్రం మండలం నుండి అధ్యక్షులు కే.దిలీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కెహుస్సేన్ బాషాను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, నాయకుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

గూడూరులో

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ఆదివారం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వం రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు నిర్మల, సూర్య ప్రకాష్ , రామచంద్రయ్య, విజయభాస్కర్ , సుధీర్ , నాగేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి: సిఐటియూ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ, టౌన్: 104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటియూ జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించాలని కోరుతూ 104 ఉద్యోగు లు తిరుపతి పాత మున్సిపల్ ఆఫీసు ఎదుట ఆదివారం ధర్నా, నిరసన తెలిపా రు. ఈ సందర్భంగా సీఐటియూ జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం మాట్లా డుతూ 104 ఉద్యోగులు 16 సంవత్సరాల నుండి ప్రజలకు సేవలు అందిస్తున్నారని, గత వైసీపీ ప్రభుత్వం వారిని అరబిందో యాజమాన్యానికి అప్పగించిందని, గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో డ్రైవర్, డీఈవోలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రంలో ఇతర ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల కంటే చాలా తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా సమస్యలకు పరిష్కారం చూపటం లేదని ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాకి సంఘీభావం తెలిపిన తిరుపతి జిల్లా 104 ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు టి రామకృష్ణ, సీఐటియూ జిల్లా కార్యదర్శి యస్ జయచంద్ర, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ 104 ఉద్యోగుల సర్వీసులను ప్రభుత్వం గతంలో మాదిరి నిర్వహణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, ప్రభుత్వమే ప్రతినెలా ఒకటో తేదీ జీతాలు చెల్లించాలని, అరబిందో యాజమాన్యం గత మూడు సంవత్స రాల నుండి యాజమాన్యం నిర్లక్ష్యంగా వెయ్యని ఇంక్రిమెంట్లు అరియర్స్ రూపంలో ఇవ్వాలని డిమాండు చేశారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పి అమరనాథ్, ప్రధాన కార్యదర్శి టి బత్తిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020 జూలై 1 నుండి అరబిందో ఫార్మా ఫౌండేషన్ అనే సర్వీస్ ప్రొవైడర్‌కి ఇచ్చి మళ్లీ తమను ప్రైవేటుకు అప్పగించి త్వరలో ఆప్కాస్‌లో విలియం చేస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యకు పరిష్కారం చూపాలని, జీతాలు సరిగ్గా అందక అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టు కొస్తున్నామన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో వుంచుకుని జీవో నెంబర్ 7 ప్రకారం వేతనాలు ఇప్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మునిరాజా , 104 ఉద్యోగుల కోశాధికారి వై. భువనేశ్వరి, జాయింట్ సెక్రెటరీ లు ఉపేంద్ర, నవీన్, అశోక్ కుమార్, కమిటీ సభ్యులు దివాకర్, రుద్రయ్య, కోటయ్య, వెంకటరమణ, అభిషేక్ రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం

నేటి నుండి అంతర్ కళాశాలల క్రీడల పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ మొదటి విడత అంతర కళాశాలల క్రీడలు ఆటలు, సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనం 2024 -25 ను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వేదికగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్, డాక్టర్ ఎంవి రమణ తెలిపారు. ఈనెల 11వ తేదీ నుండి 13 వరకు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల లో నిర్వహించనున్న ఈ సమ్మేళనానికి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, వ్యవసాయ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలకు చెందిన 410 మంది విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. వ్యవసాయ వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి కరుణాసాగర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమ ప్రారంభోత్సవ సమావేశానికి వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి ముఖ్య అతిథిగా, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ సిహెచ్. అప్పారావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ వి సుమతి గౌరవ అతిథులుగా పాల్గొంటారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడా సమ్మేళనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.

నిబంధనలు నిల్.. కలెక్షన్ ఫుల్..

- వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ బాగోతం
- ప్రతి లారీ ఆగి రూ.500 నుండి 5వేలు వరకు సమర్పించుకోవాల్సిందే..
- అనధికారిక వ్యక్తుల కలెక్షన్ దందా

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలో శ్రీకాళహస్తికి వెళ్లే రహదారిపై వ్యవసాయ మార్కెట్ సొసైటీ వారి చెక్ పోస్ట్ లో నిబంధనలను తుంగలో తొక్కి వేలకు వేల రూపాయలు వాహనాల వద్ద వసూలు చేస్తున్న ఘటన వెలుగు చూసింది. సత్యవేడు మండలంలో నిర్వహిస్తున్న ఈ వ్యవసాయ మార్కెట్ సొసైటీ వారి చెక్ పోస్ట్ కొన్ని దశాబ్దాలకు పూర్వం ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్ట్ నాగలాపురం వ్యవసాయ మార్కెటింగ్ సొసైటీ వారికి సంబంధించింది..కేవలం వ్యవసాయ సంబంధమైన చెస్ వసూలు పట్టికలోని వాటిని మాత్రమే తనిఖీ చేయడానికి, నిర్బంధించటానికి అనుమతులు కలిగి ఉన్నా ఈ చెక్ పోస్ట్‌లో ఉద్యోగులు మాత్రం ఈ నియమాలు అన్నిటిని తుంగలో తొక్కి రహదారిపై వెళ్లే ప్రతి లోడ్ వాహనాలను ఆపి ఈ చెక్‌పోస్టుకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ ఓవర్ లోడ్ సంబంధిత విషయాలను డ్రైవర్ల దృష్టికి తెస్తూ ప్రతి వాహనం నుండి 5వందల రూపాయల నుండి 5వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లుగా వాహనదారులు వాపోతున్నారు. వాహనదారుల కథనం మేరకు.. ఈ చెక్ పోస్ట్‌లో మొత్తం నలుగురు తాత్కాలిక ప్రాతిపదిక ఉద్యోగులు పని చేస్తుండగా అందులో ఇద్దరు అనధికారికమైన వ్యక్తులని తెలుస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై రోజుకు సుమారు 300 నుండి 500 వరకు లారీలు ప్రయాణం చేస్తుంటాయి. ఈ లెక్కల ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి రసీదు లు ఇవ్వకుండానే ఈ వ్యవసా య మార్కెటింగ్ చెక్ పోస్టులో వేలకు వేలు దోచేస్తున్న దుస్థితి నెలకొం ది. ఈ చెక్ పోస్ట్ కార్యా లయంలో ప్రభుత్వ ఉత్తర్వు లతో కూడిన ఎలాంటి ధృవపత్రాలు కానీ, సంబంధిత అధికారిక పత్రా లు కానీ అందుబా టులో లేకపోగా వ్యవసాయ సంబంధమైన ఉత్పత్తులను మోసుకొని వెళ్లే లారీలకు సైతం ఎలాంటి రసీదులు ఇవ్వకనే పరిమితికి మించి వసూలు చేస్తున్నట్లుగా వాహనదారులు వాపోతు న్నారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు దీనిపై స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అవినీతికి నిలయంగా మారిన వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు

భూముల ఆక్రమణలు వెంటనే అరికట్టాలి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: నారాయణవనం మండల గ్రామాల్లో ఎక్కువగా పోరంబోకు భూములు, కాలువ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వీటిని అరికట్టాలని కోరుతూ సిపిఎం నాయకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో నారాయణవనం మండలం పాళమంగలంలో ఆదివారం ప్రజాపోరు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మునిశంకర్ మాట్లాడుతూ పాలమంగళం ఉత్తర,దక్షిణ గ్రామాల గ్రామకంఠం, కాలువ పోరంబోకు భూములు ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యక్తులు అ భూములను ఆక్రమణ గురిచేస్తూ ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పెద్దలు యువత గ్రామ అవసరాల కోసం గ్రంథాలయం, ప్లేగ్రౌండ్ కావాలని పదే పదే అడుగుతున్నా స్థలాలు లేవని కుంటి సాకులు చెప్తున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాలు అర్హులు ఉన్నప్పటికీ స్థలాలు లేవని చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. ప్రజలపై దౌర్జన్యాలు చేస్తున్న భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరుణా నది తీరంలో ఇసుక మాఫియా చేస్తున్న తవ్వకాల వల్ల చుట్టుపక్కల బోర్లు కలుషితమై తాగు నీరు కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఎర్ర మట్టి రవాణా వల్ల రోజూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శివయ్య, దేశయ్య, చెంచయ్య, దయ, నాగయ్య, బసవయ్య, కన్నెమ్మ, వెంకటమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నారాయణవనం మండలంలో

ప్రజా పోరులో సిపిఎం నాయకుల డిమాండు

సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలో సిపిఎం చేపడుతున్న ప్రజాపోరు పోస్టరును, కరపత్రాలను ఆ పార్టీ మండల కార్యదర్శి మెలుగు రమేష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ పక్క అధిక ధరలతో ప్రజలు అల్లాడుతుంటే ధరలను నియంత్రించి ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ ఛార్జీలను పెంచి ప్రజలపై మరింత భారం మోపడానికి యత్నించడాన్ని తప్పుపట్టారు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. సత్యవేడు శ్రీ సిటీ పారిశ్రామికవాడలో విద్యా అర్హతకు తగ్గట్టుగా స్థానికులకే 70శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. సత్యవేడు మండలంలోని దళితుల, గిరిజనుల అనుభవంలో ఉన్న సాగు భూములకు, వారి నివాస స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వెంటనే ప్రభుత్వం రోడ్లను నిర్మించాలని తెలిపారు. అనంతరం ఇంటింటి ప్రజాపోరు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 14వ తేదీ చేపట్టనున్న కలెక్టరేట్ , మండల కార్యాలయం ఎదుట ప్రజాపోరు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు మునుస్వామి, మగి, ఎంజీఆర్ ముత్తు, కృష్ణయ్య, శాంతి, కౌశల్య, శ్యామల, రాణమ్మ పాల్గొన్నారు.

ఏర్పేడులో

తిరుపతి డెస్క్: కలెక్టరేట్ల, వండల కార్యాలయాల వద్ద నవంబర్ 8 నుండి 15 వరకు అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు,పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింట జరిగే ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా పోరులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఏర్పేడు సిపిఎం నాయకులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత, ఉపాధ్యక్షులు రంగయ్య,వెంకటేశ్వరరావు, ధర్మారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ సమీపంలోని పంబలేరు బ్రిడ్జి జాతీయ రహదారి వద్ద కారు ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు నెల్లూరు నుండి గూడూరు వైపు వస్తున్న పాల లోడుతో ఉన్న ఆటోను వెనుక వైపు నుండి కారు ఢీకొనడంతో డ్రైవర్, శివ ప్రసాద్ (19) కిందపడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతినికి భార్య , ఒక కొడుకు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న సంఘటన మంగళం పరిధిలోని మంగళం డిపో వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో రోడ్డు వైపుకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. ఎవరికి ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

22 కేజీల గంజాయి పట్టివేత

ఆరుగురు అరెస్ట్, ఒకరు పరారీ

ప్రజాశక్తి -చంద్రగిరి: మండలంలోని ఎం కొంగరవారి పల్లి జగనన్న కాలనీలో గంజాయి విక్రయ స్థావరంపై చంద్రగిరి సిఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడి చేశారు. శనివారం ఎం కొంగర వారి పల్లి జగనన్న కాలనీలలో పోలీసుల తనిఖీ నిర్వహిస్తుండగా 22 కేజీల గంజాయిని గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న ఎస్ బేబీ, (అల్లూరు) తణుకు నరసింహ(పల్లిపట్టు), అబ్దుల్ ఖయ్యూమ్(తిరుపతి) గంజి ప్రవీణ్, కార్తీక్, మణికంఠ (తిరుచానూరు) ఆరుగురిని విక్రయదారులను అరెస్టు చేసి శనివారం తిరుపతి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు డిమాండ్ విధించినట్లు సీఐ సుబ్బరామిరెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. చంద్రగిరిని డ్రగ్స్ రహిత చంద్రగిరి గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అన్నారు. ఎక్కడైనా యువత డ్రగ్స్, గంజాయి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ప్రజలు వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు.

నిందితుడికి కఠిన శిక్షపడేలా చూస్తాం: ఎమ్మెల్యే

చిన్నారి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం అలివేలు ఎస్టీ కాలనీ చిన్నారి హత్యకు కారకుడైన వ్యక్తికి చట్ట పరంగా కఠిన శిక్ష పడేలా చూస్తామని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే చిన్నారి తల్లిదండ్రులను ఆదివారం కలిసి వారి వద్ద పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దారు, వడమాలపేట జడ్పిటీసీ దయాసాగర్ ఉన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు, వడమాల పేట మండల మహిళా నాయకురాలు హైమావతి, టిడిపి మండల అధ్యక్షుడు జాన వెంకటయ్య, ధనుంజయ నాయుడు, ఎస్‌బిఆర్‌పురం సర్పంచ్ మణి రాజు, టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'14న మాదిగల ఆత్మీయ సదస్సుకు తరలిరండి'

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం కొత్త వీరాపురంలో మదనపల్లిలో ఈ నెల 14వ తేదీ మాదిగల ఆశాజ్యోతి, ఎస్సీ వర్గీకరణ విజయసారథి మందకృష్ణ మాదిగ మదనపల్లికి విచ్చేస్తున్న మాదిగల ఆత్మీయ సదస్సుకు ఏర్పేడు మాదిగ సోదరులు తరలి రావాలని కోరుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్య రాజా, శ్రీకాళహస్తి నియోజక వర్గ యువసేన అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్, యువసేన పట్టణ అధ్యక్షులు పాలూరి వెంకటమునిని ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పేడు మండలంలో విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సదస్సుకు మాదిగలందరూ తరలి రావాలని వారు కోరారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ వద్ద లయన్స్ క్లబ్ వైజెపి ఆధ్వర్యంలో ఉచిత షుగర్ టెస్ట్ వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. చెన్నై నగరానికి చెందిన కార్యన్ హెల్త్ కేర్ అండ్ స్పెషాలిటీ వైద్య నిపుణుల పర్యవేక్షణలో క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి ఉపాధ్యక్షుడు సుధాకర్ కుటుంబ సభ్యుల సహకారంతో ఉచిత షుగర్ టెస్ట్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యుడు మురళి నాయుడు మాట్లాడుతూ ఈ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగ కరంగా వున్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఆర్‌విరావు , ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

13న శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానం

ప్రజాశక్తి - తిరుమల: ఈ నెల 13వ తేదీన కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని టిటిడి ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశిని ప్రతిఏటా టిటిడి ఘనంగా నిర్వహిస్తుంది.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు , ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీ నగర్ లోని ప్రగతి కార్యాలయంలో కళియంబాక రామయ్య అనసూయ దేవి జ్ఞాపకార్థం వారి మనవళ్లు కె శివ శంకర్ , కె శశిధర్ , మనుమరాలు కె మంజు భార్గవి వారి కుటుంబ సభ్యుల సహకారంతో కార్తీక మాసం సందర్భంగా 50 మంది నిరుపేద మహిళలకు చీరలు వెజిటబుల్ బిర్యాని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కుటుంబ సభ్యులు, టీచర్ మామడూరు రాధయ్య, అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ , వాచ్ షాపు రాము , కోట వెంకటేశ్వర్లు సర్వీస్ శెట్టి నాగరాజు, శ్రీనివాసులు , తూపిలి యశ్వంత్ , సంచి ముని ప్రసాద్ , నాగేంద్ర , గోల్డ్ షాప్ మల్లి దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీఐటియూ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - దొరవారిసత్రం : సీఐటియూ సమన్వయ కమిటీని దొరవారి సత్రం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షులు డి రమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. సీఐటీయూ కన్వీనర్‌గా కె విజయభాస్కర్ , కో కన్వీనర్‌గా బి బత్తెయ్య తోపాటు సభ్యులుగా బి రాజారావు, టి మంజుల, ఎన్ భారతి, వై లీలమ్మ , బి రాజ్ కుమార్, బి శివయ్య , బి ప్రసూనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ప్రాధాన్యత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి లక్ష్మయ్య , బత్తెయ్య , నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా కామాక్షయ్య

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: పిచ్చాటూరు మండలం రాజానగరం పాఠశాలలో పనిచేస్తున్న కామాక్షయ్యకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా కామాక్షయ్య ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు రావడం పట్ల నాగలాపురం మండలం, పిచ్చాటూరు మండల వివిధ పార్టీ నాయకులు, తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

15 వరకు తపాలా శాఖ ప్రత్యేక శిబిరాలు

పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 15వ తేదీ వరకు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని సచివాలయాల్లో తపాలా శాఖ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం అందిస్తున్న సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేయనున్నట్లు చెప్పారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి), ఎన్‌సిపిఐ లింకు కలిగి ఉండాలని చెప్పారు. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో శ్రీకాళహస్తి రూరల్, అర్బన్, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం, సత్యవేడు, కే వి బి పురం మండలాల పరిధిలో సుమారు 40,140 మంది తమ ఖాతాలను ఎన్‌సిపిఐ మ్యాపింగ్, ఆధార్ అనుసంధానం కాకపోవడంతో వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందే అవకాశం లేదన్నారు. ఎన్‌సిపిఐ యాక్టివేషన్‌కు సంబంధించి తపాలా శాఖలో ఖాతా ఉంటే వెంటనే లింక్ చేసుకోవాలని సూచించారు. తపాలా శాఖలో ఖాతాలు లేని వారు తమ ఆధార్ కార్డు తీసుకుని ఆయా గ్రామ పరిధిలోని తపాలా కార్యాలయాలకు వెళ్లి ఖాతాలు తెరిచిన మూడు రోజుల్లో ఎన్‌సిపిఐ యాక్టివేషన్ అవుతుందని వివరించారు. తమ గ్రామ పరిధిలో ఉన్న తపాలా శాఖలో ఖాతాలు తెరవడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు తమ గ్రామంలోనే తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. తపాలా శాఖ కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు: సిఐ

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పీలేరు రూరల్ సిఐ ఇమ్రాన్, భాకరాపేట ఎస్ఐ రామచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు , చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి , డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు భాకరాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవ్వరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, నాటు సారా తయారీ, విక్రయాలు చేపట్టినప్పుడు సమాచారం వస్తే అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే ప్రజలు భాకరాపేట సిఐ 9490617880, ఎస్ఐ 9440900711 ఫోను నెంబర్లకు కాని సమాచారం ఇవ్వాలని, బెల్ట్ షాపు నిర్వాహకులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకొని రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

యర్రావారిపాలెం: మండలంలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, నాటు సారా తయారుచేసి అమ్మిన సదరు వ్యక్తులు పైన కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ డివై స్వామి తెలిపారు. ఆదివారం ఎస్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో బెల్ట్ షాపులు ఉన్న ప్రతి గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలో ఉన్న వైన్ షాపుల నుండి ఎవరికైనా బెల్ట్ అమ్మితే ప్రభుత్వ ఆదేశాల మేరకు వైన్ షాపు లైసెన్స్ రద్దు చేస్తామని వైన్ షాప్ యజమానులకు హెచ్చరించారు. నాటు సారా అమ్మినా, బెల్ట్ షాపులు నిర్వహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్ట ప్రకారం కేసు నమోదు చేసి రిమాండుకు తరలిస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

చంద్రగిరి: చంద్రగిరి సర్కిల్ పరిధిలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, నాటు సారా తయారుచేసిన అమ్మినా ఆ వ్యక్తుల పైన కఠినంగా చర్యలు తీసుకుంటామని చంద్రగిరి సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఆదివారం సిఐ సుబ్బరామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ చంద్రగిరి సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులు ఉన్న ప్రతి గ్రామన్ని తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలో ఉన్న వైన్ షాపుల నుండి ఎవరికైనా బెల్ట్ షాపు నిర్వహణకు భారీ మొత్తంలో మద్యం ఇస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు వైన్ షాపు లైసెన్స్ రద్దు చేస్తామని వైన్ షాప్ యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. గ్రామాలలో గంజాయి, నాటు సారా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన,తప్పుడు సమాచారాలు, ఇతరులను రెచ్చగొట్టే విధంగా సందేశాలు పెడితే సహించేది లేదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నియోజక వర్గంలో ఉన్న గ్రామీణ, పట్టణ అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం నగరి నియోజకవర్గ వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుత్తూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, తీవ్రంగా ఉందని వాటిని అరికట్టేందుకు పోలీస్ శాఖ శ్రద్ధ వహించాలన్నారు. పుత్తూరు పట్టణంలో విద్యా సంస్థలు ఉండడంవల్ల ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ తీవ్రంగా ఉందని వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాలు జరగకుండా ఆన్లైన్ ద్వారా బుకింగ్ చేసిన వారికి సక్రమంగా అందే విధంగా రెవెన్యూ శాఖ పోలీస్ శాఖ చొరవ చూపాలని ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలన్నారు. తాగునీటి సంఘాలు ఎన్నికలు నిబంధనలు ప్రకారంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉన్నాయని వాటిపై పరిశీలించాలన్నారు. శ్మశాన వాటిక లేకుండా ఉన్నచోట వారికి ఏర్పాటు చేయాలని రెవెన్యూ శాఖకు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరమ్మతుకు గురై ఉన్న రోడ్లను పరిశీలించి వెంటనే మరమ్మతుకు చేసేందుకు కృషి చేయాలని తెలిపారు మినీ గోకులం అర్హులైన వారికి అందించాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం మరమ్మతుకు గురైందని నివేదిక పంపిస్తే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నగరి మున్సిపల్ కార్యాలయం భవనానికి తగిన నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఎంపీడీవో రమేష్ బాబు, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, డిఎస్పి రవి కుమార్ సిఐ సురేంద్ర నాయుడు, విద్యుత్ శాఖ డిఇ, ఏడి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఇరిగేషన్ డిఇ, మధుసూదన్, వడమాలపేట తహశీల్దారు, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎస్ ప్రతాప్ రాజు, మాజీ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, ఏ ఆనంద్, వెంకటేశ్వర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని సాంబయ్యపాలెం పంచాయతీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు మాట్లాడుతూ రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందడం ద్వారా ప్రమాద బీమా ఐదు లక్షలు పొందచ్చని సూచించారు. సీఎం రిలీఫ్ ఫండ్ త్వరితగతిన పొందే అవకాశం ఉంటుందనీ, కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముని చంద్రారెడ్డి, దుర్గారెడ్డి, చెంగయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ కార్తీక వనభోజనం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి కరకంబాడి రోడ్డులోని వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ సభ్యులతో కార్తీక వనభోజనమహోత్సవాన్ని వడమాలపేట మండలం ఉమామహేశ్వరాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ విచ్చేశారు.సుమారు 300 మంది సభ్యులతో కలసి శివునికి అభిషేకించి తీర్థప్రసాదాలను వాకర్స్ కు అందజేశారు. ఆలయం ఆవరణంలోనే భోజనాలు వండి అందరికి వడ్డించారని తెలిపారు. చివరగా వాకర్స్ సభ్యులకు జ్ఞాపిక ను , నూతన సంవత్సర డైరీ, కాలెండర్ల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, సంకల్ప హాస్పిటల్ డైరెక్టర్ బండ్ల సోమేశ్ , వి. జగన్నాధం , వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు బాలాజీ , శివారెడ్డి , సాయి కృష్ణంరాజు, చంద్ర ,నరసింహయ్య ,శాంతి, పుష్పలత, కమలమ్మ పాల్గొన్నారు.

పాకాల మండల సీఐటీయూ కన్వీనర్‌గా ప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సిఐటియు మండల కన్వీనర్ ప్రసాద్ ఎన్నుకున్నట్టు సిపిఎం పాకాల మండల కార్యదర్శి పి మధు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ జయచంద్ర తెలిపారు. ఆదివారం సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, సంఘమిత్ర, 104 ,108, కార్మికుల బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారిన కార్మికుల జీవితాలు వెలుగు రావడంలేదని కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పాకాల మండలం ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కో కన్వీనర్ గా మురళిని, బిల్డింగ్ వర్కర్స్ నాయకులుగా వెంకటరత్నం, పెద్దిల కమిటీ సభ్యులుగా బాబు , వెంకటేశ, ధనమ్మ స్వప్న భారత్ గురవయ్య, శ్రామిక మహిళా కన్వీనర్ గా సుగుణమ్మను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ సమన్వయకర్తగా దామోదర్‌రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జాతీయ కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్తగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన తలపా దామోదర్ రెడ్డిని నియమించారు. విజయవాడలో జరిగిన కాంగ్రెస్ నియోజకవర్గాల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, దామోదర్ రెడ్డికి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కి పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

వాహనాల తనిఖీ

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళంలో తిరుచానూరు ఎస్ఐ జగన్నాథ రెడ్డి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్సు లేకుండా, ట్రిపుల్ రైడింగ్, సెల్ఫోను డ్రైవింగ్ తో పట్టుబడ్డ వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ వాహన చట్టం ప్రకారం రోడ్డుపైకి వచ్చే వాహనదారులు వాహనానికి సంబంధించిన రికార్డులను, వాహన చట్టం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. నూతన వాహన చట్టం ప్రకారం జరిమానాలు భారీగా ఉంటాయని, ప్రజలు నిబంధనలు అతిక్రమించకూడదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మంగళం బీట్ పోస్టు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీక వన భోజనం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా విజయ భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం వనభోజనం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొని వనభోజనాన్ని స్వీకరించారు. గూడూరు పట్టణంలోని గమల్లపాలెం లో ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగ విఠల్ నాథ స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .

రవి రాజుకు గౌరవ ఫెలోషిప్ అవార్డు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: చెన్నైలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ నుంచి గౌరవ ఫెలోషిప్ అవార్డును పుత్తూరు చెందిన పేదల (విశ్రాంత) డాక్టర్ రవి రాజు అందుకున్నారు. చెన్నైలో 9, 10 తేదీలలో రెండు రోజులు పాటు ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి రాజును ఐకాన్ 24 గా ఎంపిక చేసి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు. గత 20 సంవత్సరాల ముందే ఆంత్రాక్స్ వ్యాధిపై పరిశోధన చేసి పుత్తూరులో పేద రోగులకు సేవలందించిన ఘనత డాక్టర్ రవి రాజు గతంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ గా డాక్టర్ రవిరాజు నంద్యాలలో జరిగినా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ సమావేశంలో కోవిడ్ ఇమ్యూనేషన్ అధికారి, ప్రభుత్వ వైద్యులు హోదాలో డాక్టర్ రవిరాజును 2023-24 సంవత్సరానికి గాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ గా నియమితులయ్యారు. కోవిడ్ సమయంలో ఆయన కోవిడ్ రోగులకు చేసిన సేవలు, మధుమేహం, బీపీ వంటి వ్యాధులపై ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి రెండు ప్రత్యేక అవార్డులను ఇచ్చి సత్కరించారు. వాకర్స్ అసోషియేషన్ కో ఆర్డినేటర్ గా, ఇండియన్ స్టేట్ మెడికల్ అసోసియేషన్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా కూడా పనిచేశారు. పేదల డాక్టర్ రవి రాజు ఈ పురస్కారం అందుకోవడంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

గౌరవ ఫెలోషిప్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ రవి రాజు

నేటి విద్యార్థులే దేశానికి వెన్నెముక : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - క్యాంపస్ : నేటి విద్యార్థులు రేపటి బంగారు భవిష్యత్తుకు కలలు కనే దేశానికి వెన్నెముక వంటి వారిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ కల్చరల్ అండ్ స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో అంతర డిగ్రీ కళాశాల సాంస్కృతిక పోటీలు "యువతరం 2024" పేరుతో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆదివారం ఘనంగా శ్రీ శ్రీనివాస ఆడిటోరియంలో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వి యూనివర్సిటీతో తనకి ఎంతో అనుబంధం ఉందని ఇక్కడే పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశానని, జర్నలిస్టుగా కొన్ని వందల కార్యక్రమాలను వర్సిటీలో అంశాలను పరిశీలించి ప్రత్యక్ష సాక్షిగా నిలిచానన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిగత, శారీరక నైపుణ్యాలను పెంపొందించుకుంటారన్నారు. నిరంతరం చదువుల ఒత్తిడి ప్రపంచంలో జీవించే విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఒక ఆటవిడుపు అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతి కార్యక్రమాలు క్రీడలలో పాల్గొంటూ నైతిక విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని సూచించారు ఎస్వీయూ ఇన్చార్జ్ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థు లకు అనేక రకాల సదుపాయా లను కల్పిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఇటువంటి కల్చరల్ ప్రోగ్రామ్స్ ను వర్సిటీలో మరెన్నో నిర్వహించేందుకు కల్చరల్ డైరెక్టర్, కోఆర్డినేటర్లకు సూచించారు. ఆచార్య మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ గత మూడు రోజులుగా విద్యార్థుల ఉత్సాహం, ఉల్లాసం చూస్తుంటే చిన్నప్పటి జ్ఞాపకాల గుర్తుకు వస్తున్నాయని గుర్తు చేశారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం అలవడాలంటే క్రీడలు, సాంస్కృతిక పోటీలలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఎస్సీఏ డైరెక్టర్ ఆచార్య బివి మురళీధర్, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, డాక్టర్ కళ్యాణ్, వర్సిటీ ఆధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థు లు, వివిధ డిగ్రీ కళాశాల అధ్యా పకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

వినోద్ కుమార్ రెడ్డి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి ఆదివారం వైసిపి నుండి టిడిపిలో చేరారు. ఆయన వైసిపి సభ్యత్వానికి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో కోట మండలంలోని నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి నివాసంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డికి శాలువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి తో పాటు 32 మంది వైసిపి నేతలు, ఎంపీటీసీ, సర్పంచ్, మాజీ సర్పంచ్ లు రాజీనామా చేశారు. నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డితో పాటు తన అనుచరులను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినోద్‌కుమార్‌రెడ్డి తనకు సుపరిచితుడే అని, తమ్ముడు లాంటివాడని సంబోధించారు. గతంలో నల్లపురెడ్డి కుటుంబం నుండే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానని గుర్తు చేస్తూ నల్లపురెడ్డి గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్‌లు ఈ ప్రాంతాలలో మరెన్నో అభివృద్ధి పనులు చేశారని వారిని కొనియాడారు. తనను గెలిపించింది పేదలు, మధ్యతరగతి కుటుంబాలేనని పేర్కొన్నారు. తాను నెల్లూరులో నివాసం ఉన్నా కానీ ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గూడూరు దళితవాడలోనే ఉంటున్నానని తెలిపారు. పూర్వపు టిడిపి నాయకులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటానని, ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రాజకీయాలు ఎప్పుడు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి అని తాను కూడా వైసీపీ నుండి టిడిపిలోకి వచ్చానని తెలిపారు. మండలంలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రక్రియను నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వేగవంతం చేయాలన్నారు. చివరగా చంద్రబాబు, లోకేష్ లతో మాట్లాడి నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డిని పార్టీ తీర్థం పుచ్చుకోవడానికి తేదీని ఖరారు చేస్తామని తెలిపారు. అనంతరం నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నుండి టిడిపిలోకి రావడం సంతోషదాయకంగా ఉందన్నారు. ప్రస్తుతం టిడిపి అభివృద్ధికి ఎవరితో ఎలాంటి బేధాలు లేకుండా అందరితో కలిసి మెలిసి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కోట ఆర్టీసీ బస్టాండ్ లో కోట నుండి చెన్నైకి,తిరుమలకు వెళ్లే నూతన బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన పలు పనుల నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తిన్నెలపూడి పంచాయతీలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, చిల్లకూరు దశరథ రామిరెడ్డి, తిరుపతి పార్లమెంట్ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్, పలగాటి భాస్కర్ రెడ్డి,షేక్ మోవీన్ బాష, ఎంపీటీసీ దారా సురేష్,తీగల సురేష్ బాబు,చాపల శ్రీనివాసులు,మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి, వాకా విజయభాస్కర్ రెడ్డి, బందెల రఘురాం, పల్లెమల్లు వెంకట కృష్ణారెడ్డి, సర్పంచ్ ఇండ్ల వెంకటరమణమ్మ, కోకర్ల మధు యాదవ్, ఆర్టీసీ డిపో మేనేజర్ పెంచలయ్య, నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డి అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపికి రాజీనామా పత్రం చూపుతున్న వినోద్‌కుమార్‌రెడ్డి

మహారాజశ్రీ శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జికోర్టులో
O.S.NO. 52/2014

Between
కోలా మునెమ్మ ...వాది
మరియు
అద్దంకి మునిశేఖర్ వగైరా ...ప్రతివాదులు

To D5:
నూతలపాటి రత్నమ్మ, భర్త లేట్ రమేష్ నాయుడు, డో.నెం. 4-18, గాండ్లవీధి, ఏర్పేడు గ్రామం & మండలం, తిరుపతి జిల్లా.

సమన్లు
ఇందుమూలముగా పై కేసు నందు 5వ ప్రతివాది అయిన నీకు తెలియజేయడం ఏమనగా పై కేసు నందు మీ హాజరు కోరుతూ పై కోర్టునందు 22.11.2024న వాయిదా కలదు. కావున మీరుగానీ, మీ తరపున ప్లీడరు గానీ 22.11.2024న ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని పక్షమున కేసు తీర్మానించబడునని, తెలియజేయడమైనది.

ఇట్లు
సి.వెంకటస్వామి
వాది తరపు న్యాయవాది, శ్రీకాళహస్తి.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO: 32 OF 2021

Andhra Pragathi Grameena Bank, Gudur Branch (Rep.by its Branch Manager). .... వాది
1. Derangula Guravaiah & 3 others ....ప్రతివాదులు

Vs

To
Derangula Mounika (D.3)
W/o Guravaiah, R/o Karaballavolu Village, Ozili Mandal, Tirupati District.
Derangula Venkataiah (D.4)
R/o Karaballavolu Village, Ozili Mandal, Tirupati District.

దావా నోటీసు
పై నెంబరు దావాలో పరిహారం లోను రికవరీ నిమిత్తం వాది మీ మీద దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తము తే.03-12-2024దికి వాయిదా వేసి వున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వతహాగాగాని, సంపూర్ణముగా సంజాయిషి పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ప్లేడరు ద్వారా గాని పై కోర్టు లో హాజరై ఆక్షేపణలు వున్నాయెడల తెలుపుకోవచ్చును. లేనియెడల విషయము మీ పరోక్షములో తీర్మానించబడును.

ఇట్లు
చిల్లకూరు రఘునాథరెడ్డి,
వాది తరపున న్యాయవాది.